సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 14 । మార్చి । 2023



కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఎల్లారెడ్డిపేట: వేములవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఎల్లారెడ్డిపేట విద్యార్థులు ప్రతిభ కనబర్చారు.



కొవ్వొత్తులతో నివాళి

ముస్తాబాద్(సిరిసిల్ల): వీర మరణం పొందిన జవాను బొంగురం మహేందర్‌రెడ్డికి ముస్తాబాద్‌లో సోమవారం విద్యార్థులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పరీక్షలంటే భయం వద్దు



పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న రవీందర్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల గురించి భయాందోళన చెందొద్దని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు గాజుల రవీందర్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కుసుమ రామయ్య జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను ఎలా సిద్ధం చేయాలనేదానిపై పలు సూచనలు చేశారు. అనంతరం 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు తెలుగులో ధారాళంగా చదవడం, రాయడంపై పరీక్ష నిర్వహించారు. హెచ్‌ఎం పరబ్రహ్మమూర్తి, పాఠశాల స్టాఫ్ సెక్రెటరీ మల్లారపు పురుషోత్తం, ఉపాధ్యాయులు ఎస్.డి.మకుబ్, హుస్సేన్ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పోరాటాలకు సంఘీభావం ప్రకటించండి



కరపత్రం విడుదల చేస్తున్న విమలక్క

వేములవాడ: ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఈనెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే బీడీ కార్మికుల సంఘీభావ బహిరంగసభను విజయవంతం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి రాష్ట్రాల చైర్మన్ విమలక్క కోరారు. వేములవాడలో సోమవారం కరపత్రం విడుదల చేశారు. పోకల సాయికుమార్, శివ, రాజేశ్వరి, బుజ్జవ్వ, మల్లవ్వ, కళావతి పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి శిబిరం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

కోనరావుపేట(వేములవాడ): కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. రెండో విడత కంటివెలుగులో భాగంగా గొల్లపల్లి(కొలనూర్)లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సర్పంచులు బొజ్జం వసంత, సురేశ్ యాదవ్, ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రాజు, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, వైద్యాధికారి వేణుమాధవ్, ఉపసర్పంచ్ లావణ్య పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

సిరిసిల్లఅర్బన్: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతుల(ఇంగ్లిష్ మీడియం)లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి గౌతమ్‌కుమార్ ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఏప్రిల్ 24వ తేదీ గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. మే 5న పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ పరిధిలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 16వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 29న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన



గంభీరావుపేట(సిరిసిల్ల): స్వచ్ఛభారత్ రెండో విడత అమలుపై అధికారులకు గంభీరావుపేట మండలపరిషత్‌లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. శిక్షణాధికారి సురేష్ అధికారులకు స్వచ్ఛభారత్ కార్యక్రమాల గురించి వివరించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం నిర్వహణపై మూడు రోజులపాటు మండలస్థాయి అధికారులకు శిక్షణ కొనసాగనుంది. తర్వాత మరో మూడు రోజులు గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బైఫోకల్ లేవ్..



- ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి ముస్తాబాద్‌కు చెందిన పిన్నోజు ప్రభాకర్. నెల క్రితం ముస్తాబాద్ కంటి వెలుగు శిబిరంలో నేత్ర పరీక్షలు చేయించుకున్నాడు. ప్రభాకర్‌కు మూడు పాయింట్లతో రీడింగ్ అద్దాలను అందజేశారు. ఆ అద్దాలు పెట్టుకున్న ప్రభాకర్ దగ్గరిచూపు బాగానే ఉంది. కానీ అవే అద్దాలు పెట్టుకుని బయటకు చూస్తే అంతా మసకగా కనిపిస్తుంది. తనకు రెండు (దూరపు, దగ్గరి) చూపుల అద్దాలు ఇవ్వాలని కోరితే.. కంటివెలుగులో ఆ సదుపాయం లేదని సిబ్బంది చెప్పారు. కేవలం రీడింగ్ అద్దాలు పెట్టుకొని.. ఉండలేకపోతున్నాడు.

- రీడింగ్ అద్దాలతో మసకగా దూరపు చూపు
- దూరపు, దగ్గరి చూపు కలిపిన అద్దాలు కరువు
- ఇప్పటి వరకు 1,34,387 మందికి నేత్ర పరీక్షలు



ముస్తాబాద్‌లో కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ముస్తాబాద్(సిరిసిల్ల): కంటి వెలుగు ఉద్దేశం మంచిదే అయినప్పటికీ రెండు రకాల సమస్యలతో ఇబ్బంది పడేవారికి మాత్రం ఆ అద్దాలు దొరకడం లేదు. దగ్గరి చూపుతో ఇబ్బంది పడుతున్న వారికి అందజేస్తున్న రీడింగ్‌గ్లాసెస్‌తో దూరపు చూపు మసకబారుతోంది. రీడింగ్ అద్దాలు పెట్టుకుంటే ఎదురుగా కూర్చున్న వారు కూడా సరిగ్గా కనిపించడం లేదని పలువురు తెలిపారు. దూరపుచూపు సమస్య ఉన్న వారికి అద్దాలు వచ్చే వరకు ఆలస్యమవుతుంది. కంటి వెలుగులో దూరపు, దగ్గరి చూపు అద్దాలు వేర్వేరుగా ఇస్తుండడంతోనే ఈ సమస్య తలెత్తుతోంది. రెండు చూపులు(బైఫోకల్) అద్దాలు కావాలని చాలా మంది అడుగుతున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదుకాని బైఫోకల్

కంటివెలుగు శిబిరాలలో రీడింగ్, దూరపు చూపు అద్దాల కోసం ఆన్‌లైన్‌లో అక్కడికక్కడే నమోదు చేస్తున్నారు. అద్దాలు అందుబాటులో లేకుంటే ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడుతున్నారు. బైఫోకల్ అద్దాలకు ఆర్డర్ పెడితే ఆన్‌లైన్‌లో నమోదుకావడం లేదు. జిల్లాలో చాలమటుకు ఇదే సమస్య చాలా మందిని వేధిస్తోంది. రీడింగ్ అద్దాలు, దూరపు చూపు గల బైఫోకల్ అద్దాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. బైక్‌మీద వెళ్లేటప్పుడు కంటి వెలుగులో ఇప్పుడు ఇస్తున్న అద్దాలు పెట్టుకుంటే ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయి. రీడింగ్ అద్దాలు పెట్టుకున్న వారికి తల తిరిగినట్లుగా ఉండడం, కళ్లు మసక బారినట్లు ఉంటుందని వాపోతున్నారు.

> జిల్లాలో కంటి వెలుగు–2లో ఇలా..
> గ్రామాలు : 255
> బృందాలు: 25
> కంటి పరీక్షలు ఇప్పటి వరకు : 1,34,387
> రీడింగ్ అద్దాలు పంపిణీ : 22,765
> పాయింట్ అద్దాలు : 17,280
> ప్రారంభమై : 35వ రోజు

బైఫోకల్.. ప్రోగ్రెసివ్ అద్దాలు అందేనా

రెండు చూపుల సమస్య ఉన్న వారికి బైఫోకల్ అద్దాలు శ్రేయస్కరం. ఒకే కళ్లజోడులో పైన దూరపు చూపు గ్లాస్ ఉండగా, కింద 'డి' ఆకారంలో రీడింగ్ అద్దం అమర్చి ఉంటుంది. రెండుచూపుల సమస్యతో వేలాది మంది బాధపడుతున్నారు. వారికి బైఫోకల్ ఇవ్వడం ద్వారా కంటి అద్దాలు ధరించడం ఇబ్బందిగా ఉండదు. ఇక ప్రోగ్రెసివ్ అద్దాలు చాలా విలువైనవి. ఒకే కళ్లజోడులో పైన దూరపు చూపు ఉండేలా అద్దం ఉంటుంది. ఇది డ్రైవింగ్ చేసే వారికి సులభంగా ఉంటుంది. కాస్త కింద అంటే మధ్యన కంప్యూటర్ ఇతర పనులు చేసుకునే వారికి సులభంగా ఉండేలా అద్దాన్ని అమర్చుతారు. అలాగే రీడింగ్ కోసం ఇదే కళ్లజోడులో మరో అద్దం ఉండేలా మూడు కలిపి ఒకే అద్దంగా ప్రోగ్రెసివ్ గ్లాసెస్ ఇస్తారు. ప్రభుత్వం బైఫోకల్, ప్రోగ్రెసివ్ అద్దాలు ఇస్తే చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

కండ్లు గుంజుతున్నయి



కంటి వెలుగు పరీక్షలకు వెళ్తే రీడింగ్ అద్దాలు ఇచ్చారు. అవి పెట్టుకుంటే కండ్లు గుంజుతున్నయి. ఎడమ, కుడి కళ్లకు ఇబ్బంది ఉంది. శిబిరంలో ఇచ్చిన అద్దాలను పెట్టుకోలేకపోతున్నాను. కంటి వైద్యనిపుణులతో పరీక్షలు చేయిస్తే బాగుంటుంది. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే కానీ.. చాలా మంది అద్దాలను వాడడంలేదు.

– సద్గుణాచారి, ముస్తాబాద్

బై ఫోకల్ అందుబాటులో లేవు..



కంటి వెలుగు శిబిరాలు విజయవంతంగా నడుస్తున్నాయి. రీడింగ్ వేరు, దూరపు చూపు అద్దాలు వేరు. ప్రస్తుతం మా వద్ద బై ఫోకల్ అద్దాలు అందుబాటులో లేవు. అధికారులకు నివేదించాం. రీడింగ్, దూరపు చూపు అద్దాలు పెట్టుకున్న వారికి తొలి రోజుల్లో కొంత ఇబ్బంది ఉంటుంది. తరువాత మామూలుగానే ఉంటుంది.

– సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి



ముగిసిన కల్యాణోత్సవాలు



వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న శివకల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకలు ముగిసినట్లు ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, ఆలయ అధికారులు తెలిపారు. హోమగుండంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, వీరశైవులు దండకాలతో ప్రదక్షిణ చేశారు. రాజన్నను సోమవారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మగుండంలో స్వామి వారికి చక్రస్నానం చేశారు. ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు అల్లి శంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్ పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షలకు సిద్ధం

- రేపటి నుంచే పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 18 కేంద్రాలు
- ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్స్: డీఐఈవో మోహన్

సిరిసిల్లఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షలకు రాజన్నసిరిసిల్ల జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షలకు జిల్లాలో 18 కేంద్రాలను కేటాయించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి మోహన్ తెలిపారు. పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

8,438 మంది విద్యార్థులు

ఫస్టియర్‌లో 3,941.. సెకండియర్‌లో 4,497 మందిజిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు 18 కేంద్రాలను సిద్ధం చేశారు. ఫస్టియర్ విద్యార్థులు 3,941 మంది, సెకండియర్‌లో 4,497 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఇప్పటికే హాల్‌టికెట్లను ఇంటర్మీడియెట్‌బోర్డు వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉంచారు. పరీక్షలంటే భయం ఉన్న వాళ్లు టెలీమానస్‌లో కౌన్సెలింగ్ తీసుకోవాలని జిల్లా అధికారులు సూచించారు. కౌన్సెలింగ్ కోసం 14416 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని పీహెచ్‌సీ సిబ్బందికి కలెక్టర్ సూచించారు.



ఇంటర్మీడియెట్ పరీక్షలపై సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సెల్‌ఫోన్‌లు నిషేధం

పరీక్ష కేంద్రాల్లోకి ఒక్క చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే సెల్‌ఫోన్ తీసుకుపోయే అవకాశం ఉంది. మిగతా సిబ్బంది కానీ, విద్యార్థులు కానీ ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లరాదని నిబంధనలు విధించారు.

ధైర్యంగా పరీక్షలు రాయండి

సిరిసిల్లకల్చరల్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకావద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి అరుణలతో పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలున్నా 95338 96887 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. పరీక్షలపై భయం వీడి, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. టెలీ మెడిసిన్ 14416 నంబర్‌కు ఫోన్‌చేస్తే కౌన్సెలింగ్ ఇస్తారని తెలిపారు. హాల్‌టికెట్లు అందని వారు బోర్డు వెబ్‌సైట్ tsbie.cgg.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షలు అంటే ఆందోళన వీడి, ధైర్యంగా కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎన్‌ఖీమ్యానాయక్, డీఆర్‌వో శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, అన్సార్, డీపీవో రవిందర్, వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, విద్యుత్, పోస్టల్, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫీజు ఇబ్బందులుండవు



విద్యార్థులకు కళాశాల ఫీజుకు, హాల్‌టికెట్స్ ఎలాంటి సంబంధం లేదు. హాల్‌టికెట్స్ ఇంటర్మీడియెట్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షకాలంలో ఏదేని భయాందోళన ఉంటే 14416 నంబర్‌లో ఉచితంగా కౌన్సెలింగ్ తీసుకోవచ్చు.

– మోహన్, డీఐఈఓ, సిరిసిల్ల

గడువులోగా సీఎమ్మార్ అందించాలి



రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిరిసిల్లకల్చరల్: నిర్దేశిత గడువులోగా ఎఫ్‌సీఐకి సీఎమ్మార్ అందించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ జిల్లాలో 2021–22లో సేకరించిన ధాన్యానికి సంబంధించి 36వేల టన్నుల సీఎమ్మార్ బియ్యాన్ని అందించాల్సి ఉందన్నారు. ఈనెల 31లోపు పారాబాయిల్డ్ రైస్‌మిల్లర్లు మిల్లింగ్ చేయాలని ఆదేశించారు. గడువు పెంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మిల్లర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏప్రిల్ నుంచి రబీ సీజన్ ప్రారంభమవుతుందని, ధాన్యం దిగుమతికి సిద్ధంగా ఉండాలన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయండి

- పంచాయతీ కార్మికుల డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

సిరిసిల్లటౌన్: తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ మాట్లాడుతూ జీవో నంబర్ 51 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని కోరారు. ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు పీఎఫ్, ప్రమాదబీమా సౌకర్యాలు కల్పించాలని, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, నివేశన స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5.50 లక్షలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో భాగం వందలాది కార్మికులు సిరిసిల్లకు వచ్చి వంటావార్పు చేపట్టారు.

టెండర్లు వేయం.. వేయనియ్యం..!

- రోడ్ల మరమ్మతుల్లో కొన్నిచోట్ల కాంట్రాక్టర్ల చేతివాటం
- అధిక ధరలకు టెండర్లు దక్కించుకునేందుకు వ్యూహం
- 210 టెండర్లలో ఒక్కటీ ఆమోదం పొందని వైనం
- పంచాయతీరాజ్ శాఖలో కొందరు అధికారుల సహకారం..?
- ఉమ్మడి జిల్లాలో 506 కి.మీ రోడ్లకు రూ.192 కోట్ల అంచనాతో పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రోడ్ల మరమ్మతుల్లో కొందరు కాంట్రాక్టర్లు చక్రం తిప్పడానికి సిద్ధమయ్యారని సమాచారం. ఇటీవల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం వీటి మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగానే కొత్త జిల్లాల వారీగా ధ్వంసమైన రోడ్లకు అంచనాలు రూపొందించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాల రాగానే.. ఆయా పనులకు టెండర్లు పిలిచారు. చాలా ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్ల నుంచి స్పందన బాగానే ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం పనులు చేసేందుకు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువవడం గమనార్హం. మరమ్మతు పనుల్లో అధిక లాభాలు గడించేందుకు టెండర్లు వేయం.. వేయనీయం అన్నట్లుగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

రింగైన కాంట్రాక్టర్లు..?

రాష్ట్రవ్యాప్తంగా వరదలు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు సంబంధించిన దుస్థితిపై 'సాక్షి' ప్రధాన పత్రికలో 'రోడ్లకు రోగం' పేరిట సమగ్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సమీక్ష జరిపారు. రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ఆ సమావేశంలో ఆదేశించారు. అందులో భాగంగా కరీంనగర్ రీజియన్‌లో ఉన్న కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించి దాదాపు రూ.192.44 కోట్ల అంచనాతో మొత్తంగా 506.39 కి.మీల మేర ధ్వంసమైన రోడ్లకు అధికారులు టెండర్లు పిలిచారు. ఇందులో ఉమ్మడి జిల్లా మొత్తం కలిపి ఫిబ్రవరి చివరినాటికి 210 టెండర్లు వచ్చాయి. అందులో నుంచి 168 టెండర్లను చీఫ్ ఇంజినీర్‌కు సమర్పించారు.



శాత్రాజీపల్లి వద్ద ధ్వంసమైన కల్వర్టు

ఒక్క టెండరూ ఆమోదం పొందలేదా?

కరీంనగర్ రీజియన్ పరిధిలో మొత్తం వచ్చిన టెండర్లలో 210లో కేవలం 168 టెండర్లు మాత్రం చీఫ్ ఇంజినీర్‌కు వెళ్లాయి. ఇప్పటివరకూ వీటిలో ఒక్క పని కూడా ఆమోదం పొందలేదు. మరోవైపు 2022–23 ఆర్థిక సంవత్సరం నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఒక్క పని కూడా ఆమోదం పొందకపోవడంలో ఆంతర్యం ఏంటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పనుల ఆమోదంలో జాప్యం వల్ల.. అధిక అంచనాలకు టెండర్లు దాఖలు చేసే కాంట్రాక్టర్లకే లబ్ధి చేకూరుస్తుందని తెలిసినా టెండర్లలో పురోగతి లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో అధికారుల తీరుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- మరికొన్ని చోట్ల రెండుసార్లు టెండర్లు పిలిచినా ఇంతవరకూ కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువైంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లంతా ముందే రింగయ్యారని, అందుకే కొన్ని చోట్ల టెండర్లు వేసినా ఎలాంటి స్పందన రావడం లేదని పంచాయతీరాజ్ సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు. మూడోసారి టెండరు పిలిచినప్పుడు ఉన్న ధర కంటే అధికంగా కోట్ చేసినా గత్యంతరం లేక ఆమోదింపజేసుకునేందుకు కాంట్రాక్టర్లు వేసిన ఎత్తుగడగా అభివర్ణిస్తున్నారు. ఇందుకు పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది కూడా సహకరిస్తున్నారని ప్రచారం సాగుతోంది.

రీజియన్	మొత్తం	బీటీఆర్	ఎఫ్‌డీఆర్	బీటీ కి.మీ	అంచనా వ్యయం రూ.కోట్లల్లో	టెండర్ రిసీవ్డ్	టెండర్ సబ్మిటెడ్
కరీంనగర్	80	24	56	209.23	96.62	77	51
జగిత్యాల	94	28	66	173.81	58.59	94	83
పెద్దపల్లి	15	15	00	36.35	11.59	15	15
రాజన్నసిరిసిల్ల	27	19	08	87.00	25.64	24	19
మొత్తం	216	86	130	506.39	192.44	210	168

(బీటీఆర్ = బ్లాక్ తార్ రోడ్డు, ఎఫ్‌డీఆర్= ఫ్లడ్ డ్యామేజ్ రోడ్డు)

నోట్: ఫిబ్రవరి చివరి నాటికి మరమ్మతుకు సంబంధించి టెండర్ల పురోగతి

క్లుప్తంగా

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ


డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

కోనరావుపేట : మండలకేంద్రంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు అనుమానం రాగా డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు. మండలకేంద్రానికి చెందిన కొమ్మిటి మల్లారెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుని వద్దకు వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగిరాగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరగకపోవడంతో ఆయన ఊపిరిపీల్చుకున్నారు. ఇంతకుముందు రెండిళ్లలో చోరీ జరగగా పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్ల టౌన్‌: బీజేపీ సిరిసిల్ల పట్టణ నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌ సోమవారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా కైలాస్‌ సిరస్వాల్‌, ఉపాధ్యక్షులుగా చొప్పదండి అంజన్న, ఊరగొండ రాజు, మ్యాన రాంప్రసాద్‌, గాజుల సదానందం, మోర శ్రీహరి, కార్యదర్శులుగా సుంకోజు రమేశ్‌చారి, కాంబోజు శ్రీధర్‌, పంపిరి అర్జున్‌, చేనేత సెల్‌ కన్వీనర్‌ ద్యావనపెల్లి రామకృష్ణ, సోషల్‌ మీడియా కన్వీనర్‌గా సిరిమల్ల మల్లేశం నియమితులైనట్లు వెల్లడించారు.

విద్యుత్‌ సమస్యలు పరిష్కరించాలి


సెస్‌ చైర్మన్‌ రామారావును సన్మానిస్తున్న ఆకుల గంగారాం, నాయకులు

రుద్రంగి (వేములవాడ): సెస్‌ డైరెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాల్లో ఉన్న విద్యుత్‌ సమస్యలను పరిష్కరించాలని సిరిసిల్ల సెస్‌ చైర్మన్‌ చిక్కాల రామారావు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని సెస్‌ కార్యాలయాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ ఆకునూరి శంకరయ్యతో కలిసి సందర్శించారు. అనంతరం సెస్‌ చైర్మన్‌ను మండల సెస్‌ డైరెక్టర్‌ ఆకుల గంగారాం నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఇక్కడ రుద్రంగి మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ పొన్నాల శ్రీనివాస్‌ రావు, నాయకులు బండారి నర్సయ్య, తదితరులున్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి
- సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు..


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

సిరిసిల్ల అర్బన్‌ : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తుదారుల నుంచి వినతులు వెలువెత్తాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు కలెక్టర్‌ అనురాగ్‌ జయంతికి వినతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా 24 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామానికి చెందిన రైతులు ఏళ్లనంచి నుంచి అసైన్డ్‌ భూములు సాగుచేసుకుంటున్నామని, తమ భూములకు రిజిస్ట్రేషన్‌ హక్కులు కల్పించాలని కోరుతూ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్‌, ఎన్‌. ఖీమ్యానాయక్‌, ఇన్‌చార్జి డీఆర్‌వో శ్రీనివాస్‌, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్‌, పలుశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి..


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌ పోచయ్య

పై చిత్రంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఇతని పేరు సర్పంచ్‌ పోచయ్య. తంగళ్లపల్లి మండలంలో పద్మనగర్‌ను గ్రామ పంచాయతీగా 2021లో ఏర్పాటు చేశారని, అప్పుడు నీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కోగా ప్రైవేట్‌ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. అప్పటినుంచి వర్క్‌ ఆర్డర్‌ డబ్బులు రూ. 1,20,000లు ప్రభుత్వ నుంచి రావాల్సి ఉంది. ఈ విషయంపై కలెక్టర్‌ స్పందించి బకాయి బిల్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డీవీఆర్‌లు తొలగించాలి..


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌

పై చిత్రంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఇతని పేరు నాగుల శ్రీనివాస్‌, బీజేపీ పట్టణాధ్యక్షుడు. సిరిసిల్ల పట్టణంలో పలువార్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల డీవీఆర్‌లను అధికార పార్టీ కౌన్సిలర్లు దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. వారి మొబైల్‌లో ఉన్న ప్రత్యేక యాప్‌ ద్వారా ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల నాయకులను కలిసిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. సీసీ కెమెరాల ఫుటేజీని దానికి సంబంధించిన డీవీఆర్‌లను కౌన్సిలర్ల ఇళ్లనుంచి తొలగించి పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేయాలని కోరారు.

వైభవంగా ఎద్దుగుట్ట మల్లన్న కల్యాణోత్సవం


మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న ప్రజాప్రతినిధులు

సిరిసిల్ల అర్బన్‌: సిరిసిల్ల మున్సిపల్‌ పరిధి పెద్దూరు–బోనాల గ్రామ శివారులోని ఎద్దుగుట్ట మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఒగ్గు పూజారులు పట్నాలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి కల్యాణంతో పాటు, రేణుకాజమదగ్ని కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. పెద్దూరు, చిన్నబోనాల, పెద్దబోనాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, యాదవ సంఘం ఆలయ కమిటీ సభ్యులు, కులసంఘం పెద్దలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ

సిరిసిల్ల టౌన్‌: పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కోడం రమణ అన్నారు. సోమవారం కార్మికులతో కలిసి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. 200 పడకలకు అనుగుణంగా శానిటేషన్‌, పేషెంట్‌ కేర్‌, సెక్యూరిటీ గార్డు విభాగాల సిబ్బందిని నియమించాలని డిమాండ్‌ చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు మూశం రమేశ్‌, ఎలిగేటి రాజశేఖర్‌, శ్రీరాం సదానందం, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న తిరుపతి రెడ్డి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం శక్తి కేంద్ర నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, యాదగిరి, శ్రీనివాస్‌ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, గణేశ్‌, రవినాయక్‌, కిరణ్‌, ఆంజనేయులు, తదితరులున్నారు.

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

వీర్నపల్లి (సిరిసిల్ల): బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అమరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ సీపీఐ చేసే పనులను ప్రజలకు వివరించేందుకు జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈనెల 16న సీపీఐ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జల ప్రభాకర్‌, జిల్లా సహాయ కార్యదర్శి సోమ నాగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగమ అంజన్న, మల్లారపు రవి, పెద్దవేని గాలయ్య, కుమ్మరి దేవయ్య, భూక్య అమర్‌, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని పరీక్ష కేంద్రాల్లోని ఏర్పాట్లను తహసీల్దార్‌ జయంత్‌కుమార్‌ పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, రాచర్ల జూనియర్‌ కళాశాలలోని కేంద్రాలను సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటి వసతి, టాయిలెట్స్‌ సమస్యలు లేకుండా చూస్తున్నట్లు తహసీల్దార్‌ తెలిపారు.

రేపు 'బలగం' సక్సెస్‌ మీట్‌

విద్యానగర్‌(కరీంనగర్‌): హర్షిత్‌ రెడ్డి, హన్షిత దిల్‌ రాజు ప్రొడక్షన్స్‌ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దిల్‌ రాజు ప్రియదర్శి, కావ్య, కల్యాణిరామ్‌, సుధాకర్‌రెడ్డి, మురళీధర్‌ గౌడ్‌ ప్రధాన పాత్రధారులుగా వేణు ఎల్దండి దర్శకత్వంలో నిర్మించిన బలగం సినిమా భారీ విజయం సాధించింది. బుధవారం సాయంత్రం కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే గ్రౌండ్‌లో సక్సెస్‌ మీట్‌ నిర్వహిస్తున్నట్లు ఆ చిత్ర యూనిట్‌ తెలిపింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌, చిత్ర దర్శకుడు వేణు, నటీనటులు, సాంకేతిక సిబ్బంది హాజరవుతారని పేర్కొంది.

గాంధీ విగ్రహం ధ్వంసం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మహాత్మాగాంధీ కుడిచేయిని విరగొట్టారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకొని, శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలిసింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రాము (ఫైల్‌)

పెగడపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన పూసాల కొమురయ్య – చిలుకమ్మ దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. రెండో కుమారుడు రాము (27) రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. నెలరోజుల క్రితం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో అక్కడున్న స్నేహితులు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి రామును 20 రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

మెట్‌పల్లి: పట్టణంలోని ఆరపేటకు చెందిన పెద్దమ్మల పెంటయ్య (50) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్యామ్‌ రాజ్‌ తెలిపారు. పెంటయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో మద్యానికి బానిసై సోమవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మోహన్‌రావుపేటలో..

కోరుట్ల రూరల్‌ : మండలంలోని మోహన్‌రావుపేటకు చెందిన తొగరి లక్ష్మణ్‌ (57) సోమవారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్‌ అప్పులబాధతో పాటు పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సరిత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రాణం తీసిన చేపల వేట


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


బోదాసు బాబురావు మృతదేహం

రుద్రంగి(వేములవాడ): చేపల వేట ఒకరి ప్రాణాలు తీసింది. చేపల వేటకు వెళ్లి రుద్రంగికి చెందిన బోదాసు బాబురావు (35) నీటిలో మునిగి చనిపోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. రుద్రంగి శివారులోని బతుకమ్మకుంటలో సోమవారం బోదాసు బాబురావు చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు చెరువులో గాలించగా.. మృతదేహం లభించింది. బాబురావుకు మూర్ఛ వ్యాధి ఉందని, చేపలు పడుతున్న సమయంలో మూర్ఛవ్యాధి రావడంతో నీట మునిగి మృతిచెందాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే బాబురావు మృతిచెందడంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. రుద్రంగి ఎస్సై ప్రభాకర్‌ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి తల్లి గంగవ్వ, భార్య లలిత, పిల్లలు ఇందు, గణేష్‌ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముస్తాబాద్‌ (సిరిసిల్ల): ముస్తాబాద్‌ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెంకు చెందిన కుర్ర దుర్గయ్య (50), ఆయన భార్య కుర్ర అంజవ్వ (45) బంధువు లక్ష్మీతో కలిసి ద్విచక్రవాహనంపై ముస్తాబాద్‌ వైపు వెళ్తున్నారు. వీరి ముందున్న టవేరాను వెనుకనుంచి ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బోరు మోటార్ల విద్యుత్‌ తీగలు చోరీ


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ముస్తాబాద్‌ (సిరిసిల్ల): మండలంలోని రైతుల పంటపొలాల నుంచి బోరు మోటార్ల విద్యుత్‌ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌లో మద్దికుంట రహదారిలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల నుంచి 23 మంది రైతులకు చెందిన బోరు మోటార్ల విద్యుత్‌ తీగలను ఆదివారం రాత్రి ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం రైతులు పొలాల వద్దకు వెళ్లగా కరెంట్‌ తీగలు తెగిపోయి ఉండడాన్ని గమనించారు. విద్యుత్‌ తీగల్లోని కాపర్‌ వైర్ల కోసమే వీటిని ఎత్తుకెళ్లినట్లు రైతులు భావిస్తున్నారు. దొంగలు అపహరించిన వైర్లను ఒకచోట వేసి కాల్చిన ఆనవాళ్లను గుర్తించారు. అనంతరం రైతులు పోలీసులకు తెలుపగా ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు.

పశువులకు మేతగా వరిపంట

- ఎకరం వదిలిపెట్టిన డీసీసీ ఉపాధ్యక్షుడు


మేకలకు వరిపంటను వదిలిన డీసీసీ ఉపాధ్యక్షుడు రాములు

ముస్తాబాద్‌(సిరిసిల్ల): కరెంట్‌ లేక.. భూగర్భ జలాలు అడుగంటి పొలాలు ఎండిపోతున్నాయని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ముస్తాబాద్‌లో తాను సాగు చేస్తున్న ఎకరం వరి పంట పూర్తిగా ఎండిపోవడతో సోమవారం మేకలు, పశువులకు వదిలిపెట్టినట్లు తెలిపారు. కరెంట్‌ సరిగ్గా రాకపోగా, బోరుబావుల్లో నీరు లేక పంట ఎండిపోయిందన్నారు. పెట్టుబడి రూ.25వేలు నష్టపోయానని వాపోయారు.

అందినంత దోసుడే !

- ఉపాధిహామీ నిధులు రూ.41వేలు స్వాహా
- పనులు చేయకుండా ఏంబీ రికార్డులు
- నోటీసులిచ్చి, చేతులు దులుపుకున్న అధికారులు
- రికవరీకి వెనుకడుగు


కంపోస్ట్‌షెడ్‌ ఆవరణలో కనిపించని టాయిలెట్లు

చందుర్తి(వేములవాడ): మండలంలోని పలు గ్రామాల్లో అవినీతికి అంతులేకుండా పోతోంది. ఉపాధిహామీ నిధులను సైతం స్వాహా చేసేశారు. పనులు చేయకుండానే ఎంబీ రికార్డులు సృష్టించి డబ్బులు దండుకున్న విషయం వెలుగుచూసిన అధికారులు రికవరీ మాత్రం చేయడం లేదు. నోటీస్‌లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

ఇదో టాయిలెట్ల అవినీతి కంపు

చందుర్తి మండలం నర్సింగాపూర్‌లోని కంపోస్ట్‌షెడ్‌ వద్ద మూత్రశాలలు, మరుగుదొడ్డి నిర్మాణం పేరిట రూ.41,660 ఎంబీ రికార్డు చేసి 2020, అక్టోబర్‌ 19న బిల్లులు చెల్లించారు. అయితే అక్కడ ఎలాంటి నిర్మాణాలు కనిపించడం లేదు. రెండున్నరేళ్లుగా ఈ విషయం బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్తగా వ్యవహరించారు. జనవరిలో సామాజిక బృందం తనిఖీల్లో ఈ విషయం వెలుగుచూసింది.

బాధ్యులపై చర్యలు ఏవి?

అక్రమంగా ఎంబీ రికార్డులు చేసి నిధులు డ్రా చేసేందుకు సహకరించిన ఉపాధిహామీ టెక్నికల్‌ అసిస్టెంట్‌, రికార్డులు చేసిన ఈసీల తప్పిదంపై నోటీసులు ఇవ్వలేదు. ఇదే వ్యవహారంలో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్‌ అసిస్టెంట్‌కు నోటీసులు జారీ చేయడంపై స్థానికంగా చర్చ జరుగుతుంది. బిల్లులు డ్రా చేసుకున్న వారికి, రికార్డులు చేసిన వారికి నోటీసులు ఇవ్వకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి. ప్రస్తుతం నోటీసులు అందుకున్న పంచాయతీ కార్యదర్శి రికార్డులు చేసిన సమయంలో బండపల్లి కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

కప్పి పుచ్చుకునేందుకు కట్టుకథలు

అవినీతి బయటపడిన అధికారులు కప్పిపుచ్చుకునేందుకు కట్టుకథలు సృష్టిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పనులు చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని, ముందస్తుగా ఎంబీ రికార్డులు చేసి నిధులు డ్రా చేసుకున్నట్లు చెబుతున్నారు. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం ఇక్కడ భిన్నంగా ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పనులు చేయకుండా నిధులు డ్రా చేశారని నోటీసులు జారీ చేశాం. ఇప్పటి వరకు నుంచి ఎలాంటి స్పందన లేదు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– పత్తి రవీందర్‌, ఎంపీడీవో, చందుర్తి

నెలదాటిన నోటీసులకు స్పందన

నర్సింగాపూర్‌ కంపోస్ట్‌షెడ్‌ వద్ద టాయిలెట్లు, ఇతర పనులపై జరిగిన అక్రమాలపై పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్‌ అసిస్టెంట్లకు ఫిబ్రవరి 6న నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు 10 రోజుల వ్యవధిలో బదులివ్వాలని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. నర్సింగాపూర్‌లో ఉపాధిహామీలో అవినీతికి గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శి సస్పెన్షన్‌ నిదర్శనం.